

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎర్రవెల్లిలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసిన మెదక్ జిల్లా నర్సాపూర్ ఎమ్మెల్యే వాకాటి సునీతాలక్ష్మారెడ్డి

# రెండో దఫా మూసీ కూల్చివేతలు!

- రంగం సిద్ధంచేసిన జిల్లాల యంత్రాంగం
- 3 జిల్లాల పరిధిలో 2,100 నిర్మాణాలు
- ఈ నెలాఖారు నాటికి నేలమట్టం!

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 15(నమస్తే తెలంగాణ): మూసీ వెంబడి రెండో దఫా కూల్చివేతలు చేపట్టేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. రివర్ బెడ్ పరిధిలోని నిర్మాణాలు, కట్టడాలు, భవనాలను నేలమట్టం చేసేందుకు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎంఆర్‌డీసీఎల్) రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాల అధికారులతో సమన్వయ సమావేశమైంది. ఇటీవల జరిగిన ఈ సమావేశంలో రివర్ బెడ్ ప్రాంతంలో ఇప్పటికే గుర్తించిన దాదాపు 2,100 నిర్మాణాలను నెలాఖరులోగా కూల్చివేయాలని ఆదేశించింది. దశల వారీగా కూల్చివేతలు జరుగుతుండగా దీపావళి తర్వాత మూడో దఫా ఆక్రమణలు, నిర్మాణాల గుర్తింపు, కూల్చివేతలకు కసరత్తు మొదలు అవుతుందని తెలిసింది. జిల్లాల వారీగా సేకరించిన సోషియో ఎకానమిక్ సర్వే, ముందుగానే గుర్తించిన రివర్ బెడ్ మ్యాపుల ఆధారంగా నిర్మాణాలను మూసీలో కలపనున్నారు.



ఈ మూడు జిల్లాల పరిధిలో 2,100 కంటే ఎక్కువగానే నిర్మాణాలు ఉన్నట్టు రెవెన్యూ, ఇరిగేషన్ మ్యాపుల ద్వారా తెలిసింది. కూల్చివేతలపై ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకే సమన్వయ సమావేశం నిర్వహించినట్టుగా ఎంఆర్‌డీసీఎల్ వర్గాలు తెలిపాయి. రివర్ బెడ్ నిర్మాణాలు కూల్చివేతలు పూర్తి కాగానే, ఎఫ్‌ఆర్‌ఎల్ పరిధిలోని నిర్మాణాలపై చర్యలు ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా కోర్టు వ్యవహారాలతో కూల్చివేతలకు ఆటంకం లేకుండా తగిన ఆధారాలు సమకూర్చుకోవాలని సూచించారు.

# కిలోమీటర్ దాకా కూలగొడ్తరా?

▸ మొదటిపేజీ తరువాయి...

ఏమీ వద్దు. మూసీ నదీ మార్గానికి రెండువైపులా కిలోమీటరు వెడల్పులో ఈ సుందరీకరణ ప్రాజెక్టును నిర్మించాలని రేవంత్‌రెడ్డి సర్కారు నిర్ణయించింది. సాక్షాత్తూ కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వ పెద్దల సమక్షంలో ప్రజా సంఘాలతో జరిగిన సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. అంతేకాదు, సదరు ప్రజా సంఘాలకు ఇచ్చిన ప్రజెంటేషన్‌లోనూ మూసీ నదికి రెండువైపులా కిలోమీటరు చొప్పున 110 చదరపు కిలోమీటర్ల పరిధిలో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో గ్రోత్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ ప్రణాళికలో భూసేకరణ, పునరావాసం అనే ప్రక్రియలు కూడా ఉన్నాయని అందులో పేర్కొన్నారు. మూసీ సుందరీకరణ మాస్టర్‌ప్లాన్ బాధ్యతల్ని మెయిన్‌హార్ట్ కన్సార్షియంకు అప్పగించిన ఈ నెల 4వ తేదీనే కాంగ్రెస్ పార్టీ-ప్రభుత్వ పెద్దలు కొందరు ప్రజా సంఘాలతో సమావేశమయ్యారు. అందులో ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో ఉన్న కీలకమైన అంశాల్లో ఇది కూడా ఒకటి. ఇవేకాదు... మరెన్నో ఆసక్తికరమైన అంశాలతో మసిబూసి 'మూసీ' సుందరీకరణ ప్రాజెక్టును కండ్ల ముందు చూపారు.

### 4న ప్రజా సంఘాల ప్రతినిధులతో సమావేశం

మూసీ సుందరీకరణ ప్రాజెక్టు అనగానే స్వచ్ఛమైన నీటిని ప్రవహింపజేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి పదేపదే ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. ఇందుకు లక్షన్నర కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నట్టు కూడా సెలవిచ్చారు. మరి సుందరీకరణలో ఏమేం చేయబోతున్నారనే వివరాలను ఇప్పటివరకు అటు ప్రభుత్వం గానీ, ఇటు మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) అధికారులుగానీ ప్రజలకు వివరించలేదు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీ కోదండరాం తదితర ప్రముఖులు ఈ నెల 4న పలు ప్రజా సంఘాలకు చెందిన ప్రముఖులు డాక్టర్ హరగోపాల్ (రిటైర్డ్ ప్రొఫెసర్, మానవ హక్కుల కార్యకర్త), డాక్టర్ వర్గీస్ (ఛత్రి సంస్థ వ్యవస్థాపకుడు, డైరెక్టర్), సంధ్య (పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్), సజయ (ట్రాన్స్‌జెండర్స్ సంస్థల జేఏసీ సభ్యురాలు), మీరా (ఎన్‌ఏపీఎం జాతీయ కన్వీనర్), శ్రీహర్ష (సఫర్ రాష్ట్ర కోఆర్డినేటర్), డాక్టర్ లిస్సీ జోసెఫ్ (తెలంగాణ డొమెస్టిక్ వర్కర్స్ యూనియన్), డాక్టర్ ఫిలిప్స్ (దివ్య దిశ డైరెక్టర్), బ్రదర్ రాజదేశాయ్ (విద్యావేత్త), సమీరాబేగం (ఉపాధ్యాయురాలు), ఏ హైమ (ఛత్రి) ఉన్నారు. వీరికి 38 పేజీలతో కూడిన ఒక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇందులో మూసీ సుందరీకరణకు సంబంధించి ఏమేం చేయబోతున్నామనే వివరాలను పొందుపరిచారు. ఇందులోనే పలుచోట్ల పొందుపరిచిన అంశాలు పలు అనుమానాలకు దారి తీస్తుండగా, మరికొన్ని ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమాచారంపై ప్రభుత్వం ఎంత గోప్యత పాటిస్తున్నది? ఎలా తప్పుడు సమాచారం వెల్లడిస్తున్నది? అనేది వెల్లడిస్తున్నాయి.

### ఎందుకీ గోప్యత?

మూసీ సుందరీకరణ నదికి రెండువైపులా అసలు ఎంత విస్తీర్ణంలో చేపడుతున్నారనే దానిపై స్పష్టమైన ప్రకటన ప్రభుత్వం నుంచి రాలేదు. పలు ప్రసంగాల్లో సీఎం రేవంత్‌రెడ్డి 12 వేల వరకు నిర్మాణాలను కూల్చివేస్తామని ప్రకటించారు. కానీ ప్రజా సంఘాలకు ఇచ్చిన ప్రజెంటేషన్‌లో రివర్ బెడ్‌తో పాటు బఫర్‌జోన్‌లో 10,017 నిర్మాణాలు (రివర్ బెడ్‌లో 2,166, బఫర్‌జోన్‌లో 7851), 200 ఖాళీ స్థలాలు ఉన్నట్టు పేర్కొన్నారు. అంటే వీటికి అనుమతులు తీసుకున్నా అక్రమ నిర్మాణాలనేది ప్రభుత్వ ఉద్దేశం.

### అక్షరాలా లక్షన్నర కోట్లు!

మూసీ సుందరీకరణ అంచనా వ్యయాన్ని ఈవోఐ టెండర్ నోటిఫికేషన్ డాక్యుమెంట్‌లో రూ. 58 వేల కోట్లుగా పొందుపరిచారు. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం మూసీ సుందరీకరణకు లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామని ప్రకటిస్తున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాత్రం 'ఎవరు చెప్పారు?' అని ఎదురు ప్రశ్నిస్తున్నారు. అయితే ప్రజాసంఘాలకు ఇచ్చిన ప్రజెంటేషన్‌లో అక్షరాలా లక్షన్నర కోట్లు మూసీ అనేది మరోసారి బహిర్గతమైంది. ఈ ప్రాజెక్టుకు పలు ఆర్థిక సంస్థల నుంచి రుణాలు తీసుకుంటామని అందులో పేర్కొన్నారు. ప్రపంచ బ్యాంకు నుంచి 500 మిలియన్ డాలర్లు, ఏషియన్ ఇన్‌ఫ్రా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ) నుంచి 500 మిలియన్ డాలర్లు, నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఎన్‌డీబీ) నుంచి 500 మిలియన్ డాలర్లు తీసుకుంటామని చెప్పారు. ఈ మేరకు చర్చలు కొనసాగుతున్నట్టు ప్రజెంటేషన్‌లో పొందుపరిచారు.

### ప్రజా సంఘాలకూ తప్పుడు సమాచారం

ప్రజా సంఘాలకు ఇచ్చిన ప్రజెంటేషన్‌లో వాస్తవాల్ని దాచడంతో పాటు తప్పుడు సమాచారాన్ని కూడా పొందుపరిచారు. మాస్టర్‌ప్లాన్ రూపకల్పన టెండర్లకు సంబంధించి ఆర్‌ఎఫ్‌పీ (రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్) టెండర్లలో అర్హత సాధించిన ఏడు బిడ్లను షార్ట్ లిస్ట్ చేయగా రెండు కన్సల్టెన్సీ కంపెనీలు మిగిలినట్టు పేర్కొన్నారు. కానీ వాస్తవానికి మొదటిసారి టెండర్లలో మాత్రమే ఏడు కంపెనీలు సాంకేతిక అర్హత సాధించాయి. అందులో ఐదు కంపెనీలు ఆర్‌ఎఫ్‌పీలను సమర్పించాయి. ప్రైస్ బిడ్లను తెరిచిన తర్వాత ప్రభుత్వ పెద్దల జోక్యంతో, మెయిన్‌హార్ట్‌కు మాత్రమే టెండర్ దక్కాలనే యోచనతో ఆ టెండర్లను రద్దు చేసిన అంశాన్ని ప్రజా సంఘాలకు వెల్లడించలేదు. ఈ నెల 4న ఇచ్చిన ప్రజెంటేషన్‌లో రెండు కంపెనీల ఆర్‌ఎఫ్‌పీ బిడ్లను పరిశీలించి, ఒక కంపెనీని ఎంపిక చేస్తామని తెలిపారు. అందులో లీ అసోసియేట్స్ కన్సార్టియంతో పాటు సింగపూర్‌కు చెందిన మెయిన్‌హార్ట్ కన్సార్షియం పేర్లు ఉన్నాయి. కానీ ప్రజా సంఘాలకు ఈ ప్రజెంటేషన్ ఇచ్చిన సమయానికి మెయిన్‌హార్ట్ కన్సార్షియంకు మాస్టర్‌ప్లాన్ బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయించింది. అదే రోజు (4వ తేదీన) ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాదు, గత నెల 25వ తేదీన ఎంఆర్‌డీసీఎల్ ఎండీ ప్రభుత్వానికి లేఖ రాస్తూ మెయిన్‌హార్ట్ కన్సార్షియం ఎంపికకు ఆమోదం తెలపాలని ప్రతిపాదించారు. అయినా, ఈ విషయాన్ని ప్రజెంటేషన్‌లో ఎందుకు దాచి పెట్టారనేది ప్రభుత్వ పెద్దలకే తెలియాలి? ఎంఆర్‌డీసీఎల్ అధికారులు లీ అసోసియేట్స్ కన్సార్షియంను సాంకేతిక కారణాలతో తిరస్కరిస్తే ప్రజా సంఘాలకు ఇచ్చిన ప్రజెంటేషన్‌లో ఆ విషయాన్ని ప్రస్తావించకుండా ఎందుకు దాచిపెట్టి మసిపూసి ప్రజెంటేషన్‌ను ప్రజా సంఘాల ముందు ఉంచారు. కన్సల్టెన్సీ కాల పరిమితి (ఎగ్జిక్యూషన్ సపోర్ట్)ని ప్రజెంటేషన్‌లో టి+48 నెలలుగా పేర్కొన్నారు. అంటే టెండర్ల పూర్తి నుంచి నాలుగు సంవత్సరాల పాటుగా చెప్పారు. కానీ మెయిన్‌హార్ట్‌కు ఇచ్చిన అంగీకార పత్రంలో 66 నెలలుగా పొడగించడం వెనక మతలబు ఏమిటన్నది రహస్యం.



### కిలోమీటరు దాకా భూసేకరణ

నదికి రెండువైపులా కిలోమీటరు వరకు ఉండే విస్తీర్ణాన్ని కూడా సేకరించనున్నట్టు ప్రజా సంఘాలకు ఇచ్చిన ప్రజెంటేషన్ ద్వారా స్పష్టమవుతుంది. అందుకే రివర్ బెడ్, బఫర్‌జోన్ వరకు ప్రత్యామ్నాయాలు చూపి, అక్కడి నుంచి కిలోమీటరు విస్తీర్ణం వరకు ఉండే నిర్మాణాలను భూసేకరణ ప్రక్రియ ద్వారా సేకరించే అవకాశాలు ఉన్నాయి. అందుకే ప్రజెంటేషన్‌లో సుందరీకరణలో భాగంగా చేపట్టే అభివృద్ధి గ్రాఫిక్స్‌ను వివరిస్తూ ఇందులో భూసేకరణ, పునరావాసం ఉంటుందని పొందుపరిచారు. భూసేకరణ చట్టం-2013 ద్వారా ఈ ప్రక్రియ ఉంటుందని కూడా స్పష్టం చేశారు. ఇందులో ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న భూమి విలువను ప్రామాణికంగా తీసుకుంటారు.

### హడావుడిలో టెండర్ల బాగోతం బట్టబయలు

ప్రజా సంఘాలకు ఇచ్చే ప్రజెంటేషన్‌ను రూపొందించడంలో ఎంఆర్‌డీసీఎల్ అధికారులు హడావుడి ప్రదర్శించినట్టు తెలుస్తున్నది. అందులో భాగంగా ఇప్పటివరకు మూసీ సుందరీకరణ ప్రాజెక్టులో గత ప్రభుత్వ హయాంలో ఏం జరిగిందనే వివరాలతో గతంలోనే రూపొందించిన వివరాలు (స్లైడ్స్) వాడుకున్నారు. ఆపై తాజాగా ఏం జరుగుతుందనే వివరాలు కలిపారు. ఈ నేపథ్యంలో గత వివరాల్లో భాగంగా మాస్టర్‌ప్లాన్ టెండర్లకు సంబంధించిన వివరాల్లో 'మాస్టర్ ప్లాన్ రూపొందించే కన్సల్టెన్సీ ఎంపిక టెండర్లలో బిడ్లను స్వీకరించాం. సాంకేతిక పరిశీలన పురోగతిలో ఉంది. 10, జూలై 2024 వరకు టెండర్ల ప్రక్రియ పూర్తవుతుంది' అని పేర్కొన్నారు. అక్టోబర్ 4వ తేదీన ఇచ్చిన ప్రజెంటేషన్‌లో మూడు నెలల కిందటనే టెండర్ల ప్రక్రియ పూర్తవుతుందనే వాక్యాలు ఉన్నాయి. అధికారులు హడావుడిలో పాత ప్రజంటేషన్‌లోని కీలక నిర్ణయాన్ని ఇందులో కొనసాగించారు. అంటే 'నమస్తే తెలంగాణ'లో టెండర్ల బాగోతంపై ఇటీవల వచ్చిన కథనం అక్షర సత్యమనేందుకు ఈ ప్రజెంటేషన్ నిదర్శనం. వాస్తవానికి అధికారులు 10, జూలై వరకు టెండర్లను పూర్తి చేద్దామని అనుకున్నారు. కానీ రేవంత్‌రెడ్డి-చంద్రబాబు భేటీ తర్వాత పరిణామాలు మారడంతో ప్రభుత్వ పెద్దల జోక్యంతో మొదటి టెండర్లు రద్దు చేశారు.

### లోకం పోకడ



అధిష్ఠానంతో ఇక మీ భేటీ కష్టమే.. మీరు కూడా ఉత్తరాలు రాయాల్సిందే!

## డాక్టర్ ఉషాలక్ష్మి అస్తమయం



హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): ప్రఖ్యాత గైనకాలజిస్ట్ డాక్టర్ కొత్త ఉషాలక్ష్మి (91) మంగళవారం తుదిశ్వాస విడిచారు. గుండె పోటుతో ఆమె మరణించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె స్వస్థలం ఏపీలోని గుంటూరు. గైనకాలజిస్ట్‌గా తెలుగు రాష్ట్రాల్లో మంచి గుర్తింపు సాధించారు. హైదరాబాద్‌లోని నిలోఫర్ దవాఖానలో సుదీర్ఘకాలం పాటు సేవలు అందించారు. 69 ఏండ్ల వయసులో బ్రెస్ట్ క్యాన్సర్ బారినపడ్డారు. ఆ వయసులోనూ ఆమె ఎంతో ధైర్యంగా దానిని ఎదుర్కొని, విజయవంతంగా బయటపడ్డారు. ఆ తర్వాత ప్రాథమిక దశలోనే బ్రెస్ట్ క్యాన్సర్‌ను గుర్తించడంపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించారు. ఇందుకోసం హైదరాబాద్‌లోని కిమ్స్ దవాఖానలో ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్‌ను 2007లో ప్రారంభించారు. ఆమె స్ఫూర్తితో ఆమె కుమారుడు, పద్మశ్రీ డాక్టర్ రఘురాం, కోడలు డాక్టర్ వైజయంతి బ్రిటన్‌లోని తమ కెరియర్‌ను వదిలిపెట్టి హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడ్డారు. కిమ్స్-ఉషాలక్ష్మి క్యాన్సర్ సెంటర్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

## నల్లగొండ బైపాస్ రోడ్డుకే నిధులు

మంజూరు చేసినట్టు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటన

రాష్ట్ర రహదారుల అప్‌గ్రేడ్ ప్రతిపాదన ఇంకా పెండింగులోనే

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని రోడ్డు ప్రాజెక్టులపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఉదాసీన వైఖరిని ప్రదర్శిస్తున్నది. తెలంగాణలోని పలు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదనలు ఎంతోకాలంగా పెండింగులో ఉండటమే ఇందుకు నిదర్శనం. నరేంద్రమోదీ సర్కారు తాజాగా రాష్ట్రంలోని ఒకే ఒక్క ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి మిగిలిన ప్రాజెక్టులను విస్మరించడం చర్చనీయాంశమైంది. ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి సొంత జిల్లాలోని నల్లగొండ బైపాస్‌కు మాత్రమే కేంద్రం అనుమతి ఇవ్వడంతో సంబంధిత పత్రాలను తీసుకునేందుకు రాష్ట్ర అధికారులు బుధవారం ఢిల్లీ వెళ్తున్నారు. నల్లగొండ పట్టణంలో 14 కి.మీ. మేర నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణానికి కేంద్రం రూ.516 కోట్లు మంజూరు చేసింది. వీటితో నకిరేకల్-నాగార్జునసాగర్ మధ్య బైపాస్ రోడ్డు పనులు ప్రారంభించనున్నట్టు ట్వీట్ చేసిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ.. రాష్ట్రంలోని పలు ఇతర రోడ్డు ప్రాజెక్టుల ప్రతిపాదనలను పెండింగ్‌లో పెట్టారు. వీటిలో ఇరుగు పొరుగు రాష్ట్రాలను అనుసంధానించే రహదారులు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు వెళ్లే మార్గాలు, కీలక బ్రిడ్జీలు ఉన్నాయి. వీటిపై సీఎం రేవంత్‌రెడ్డితోపాటు పలువురు రాష్ట్ర మంత్రులు ఇటీవల కేంద్ర పెద్దలను కలిసి సవివరంగా నివేదికను సమర్పించినప్పటికీ ఒక్క నల్లగొండ బైపాస్ పనులకు మాత్రమే గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం గమనార్హం.

### కేంద్రం వద్ద పెండింగులో ఉన్న కొన్ని ముఖ్యమైన ప్రాజెక్టులు

- కల్వకుర్తి-నంద్యాల రహదారి (ఎన్‌హెచ్-167కే) పనులు ఇప్పటికే ప్రారంభమైనప్పటికీ ఆ రహదారికి అనుసంధానమై ఉన్న హైదరాబాద్-శ్రీశైలం మార్గంలో హైదరాబాద్-కల్వకుర్తి మధ్య ప్రస్తుత మున్న రెండు వరుసల రోడ్డును 4 లేన్లకు విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదించింది.
- హైదరాబాద్-శ్రీశైలం (ఎన్‌హెచ్-765) మార్గంలో 62 కిలోమీటర్లు అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్టు పరిధిలో ఉన్నందున ఆ ప్రాంతంలో 4 వరుసల ఎలివేటెడ్ కారిడార్‌కు అనుమతులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతున్నది.
- మంథని నియోజకవర్గంలో జగిత్యాల-పెద్దపల్లి-మంథని-కాటారం రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించి, నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వం కోరుతున్నది. దీనివల్ల ఎన్‌హెచ్-565, ఎన్‌హెచ్-353సీ అనుసంధానమై తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ మధ్య రాకపోకలు సులభతరం కావడంతోపాటు దక్షిణ కాశీగా గుర్తింపుపొందిన కాళేశ్వరం క్షేత్రానికి అనుసంధానత పెరుగుతుంది.
- సేతు బంధన్ స్కీం కింద 12 ఆర్వోబీలు/ఆర్‌యూబీలు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే ప్రతిపాదించింది.
- జగిత్యాల-కాటారం (130 కి.మీ), దిండి-నల్లగొండ (100 కి.మీ), భువనగిరి-చిట్యాల (44 కి.మీ), చౌటుప్పల్-సంగారెడ్డి (182 కి.మీ), మరికల్-రామసముద్రం (63 కి.మీ), వనపర్తి-మంత్రాలయం (110 కి.మీ), మన్నెగూడ-బీదర్ (134 కి.మీ), కరీంనగర్-పిట్లం (165 కి.మీ), ఎర్రవెల్లి క్రాస్‌రోడ్-రాయచూర్ (67 కి.మీ), కొత్తపల్లి-దుద్దెడ (75 కి.మీ), సారపాక-ఏటూరునాగారం (93 కి.మీ), దుద్దెడ-రాయగిరి క్రాస్‌రోడ్ (63 కి.మీ), జగ్గయ్యపేట-కొత్తగూడెం (100 కి.మీ), సిరిసిల్ల-కోరుట్ల (65 కి.మీ), భూత్పూర్-సిరిగిరిపాడు (166 కి.మీ), కరీంనగర్-రాయపట్నం (60 కి.మీ) కలిపి మొత్తం 1,617 కి.మీ. రాష్ట్ర రోడ్లను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతున్నది.



బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, నాయకులు కిశోర్, శుభప్రద్‌పటేల్, దూదిమెట్ల బాలరాజ్ తదితరులు



కేటీఆర్‌ను కలిసి దసరా శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, రాజయ్య, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల, నన్నపనేని

# దసరా కిక్కు 1,285 కోట్లు

- 11 రోజుల్లో 1,285 కోట్ల మద్యం సేల్
- 11,03,614 కేసుల లిక్కర్, 20.63 లక్షల కేసుల బీర్లు
- 13% అమ్మకాలు సాధించిన ఆబ్కారీశాఖ
- బెల్ట్‌షాపులకు జోరుగా మద్యం సరఫరా



హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): దసరా పండుగకు రాష్ట్రంలో మద్యం ఏరులై పారింది. బీర్ల అమ్మకాలు మునుపెన్నడూలేనంత బంపర్ రేంజ్‌లో అమ్ముడయ్యాయి. దసరా దెబ్బకు ప్రభుత్వ ఖజానాలో కేవలం 11 రోజుల్లోనే రూ.1285.16 కోట్లు వచ్చిపడ్డాయి. ఆ స్థాయిలో మద్యం అమ్మకాలు చేపట్టడంలో కాంగ్రెస్ ప్రభుత్వం సఫలీకృతమైందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. పండుగ రోజు ఎక్కడా నోస్టాక్ బోర్డులు కనిపించకుండా.. డిపోలకు ముందుగానే మద్యాన్ని చేరవేసేలా ప్రభుత్వ పెద్దలు పథకం రచించారు. డిపోల నుంచి మద్యం తీసుకెళ్లే విధంగా మద్యం దుకాణాల యజమానులకు టార్గెట్లు కూడా విధించారు. 'డబ్బులు.. మందు అమ్మిన తర్వాత చెల్లించొచ్చు.. ముందు వచ్చిన స్టాక్‌ను తీసుకెళ్లండి' అంటూ ప్రత్యేకంగా ఫోన్లు చేసి మరీ డిపోల్లోని మద్యం స్టాక్‌ను ఖాళీ చేయించినట్టు తెలిసింది. ఆ పథకం ప్రకారం మొత్తం రూ.1500 కోట్లు వస్తాయని భావించగా.. దసరా పండగ శనివారం రావడంతో కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ తర్వాత ఆదివారం సెలవు రోజు కావడంతో మొత్తానికి లక్ష్యానికి చేరువగా రావడం, గత దసరా కంటే 13శాతం ఎక్కువగా లాభాలు రావడంతో ఒకింత ఊరటనిచ్చిందని తెలిసింది.

### జోరుగా లిక్కర్, బీర్ల అమ్మకాలు..

అక్టోబర్ 1 నుంచి 14 వరకూ 3 రోజులు సెలవులు పోనూ.. 11 రోజుల్లో ఎక్సైజ్‌శాఖకు రూ.1285.16 కోట్లు వచ్చాయి. వీటిల్లో ఈ సారి 11,03,614 కేసుల లిక్కర్ సీసాలు.. 20,63,350 లక్షల కేసుల బీర్లు అమ్ముడయ్యాయి. పండగకి ముందురోజు అంటే 11వ తేదీన అత్యధికంగా రాష్ట్ర వ్యాప్తంగా 3,06,761 కేసుల బీర్లను కొనుగోలు చేశారు. అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రభుత్వ పెద్దలు ఈసారి భారీస్థాయిలో బెల్ట్‌షాపులకు మద్యం విక్రయించారు. ఏ గల్లీలోని కిరాణా కొట్టులో చూసినా లిక్కర్ బాటిళ్లు, బీరు సీసాలే దర్శనమిచ్చాయనేది బహిరంగ రహస్యం. విచ్చలవిడిగా బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మకాలు కొనసాగినా ఒక్క ఎక్సైజ్ అధికారి కూడా వాటిని నిలువరించలేకపోయారు. ప్రభుత్వ పెద్దల డైరెక్షన్‌లోనే అధికారులు బెల్ట్‌షాపుల వైపు కన్నెత్తి చూడలేదని విశ్వసనీయ సమాచారం.

### బెల్ట్‌షాపుల తాట తీస్తానన్న సీఎం ఎక్కడ?

గత ప్రభుత్వం ఓ క్రమపద్ధతిలో మద్యం అమ్మకాలు చేపట్టినా.. 'తెలంగాణను తాగుబోతుల రాష్ట్రంగా చేశారు' అని పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి ఎన్నోవేదికలపై చెప్పారు. ఇప్పుడు ఆయనే సీఎంగా ఉన్నా ప్రజాపాలన పేరుతో ఇచ్చిన సంక్షేమ పథకాల అమలుకు ఎక్సైజ్‌శాఖపైనే ఆధారపడ్డారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అందుకే ఎక్కువ మద్యం అమ్మకాలు జరుపాలని అధికారులకు అనధికార ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం. లిక్కర్, బీర్, వ్యాట్స్, ఇతర లైసెన్స్‌ల ఫీజుల నుంచి ఎక్సైజ్ శాఖకు ప్రతినెలా రూ.3 వేల కోట్లకు పైగా ఆదాయం వస్తున్నది. ప్రభుత్వానికి కొన్ని పథకాల అమలుకు తక్షణం నిధులు అవసరం కావడంతో తమ లక్ష్యాన్ని రూ.45వేల కోట్లకు పెంచినట్టు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. అప్పుడు పీసీసీ అధ్యక్షుడి హోదాలో రాష్ట్రంలో ఉన్న 60వేలకు పైగా ఉన్న బెల్ట్‌షాపుల తాట తీస్తానని రేవంత్‌రెడ్డి చెప్పారు. అధికారంలోకి రాగానే బెల్టుషాపులు ఎత్తివేస్తామన్న హామీ ఏమైందని సీఎం రేవంత్‌రెడ్డిని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో మద్యనిషేధంలేకున్నా.. మద్యం నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఏడేండ్ల బాలిక కిడ్నాప్ ఆపై హత్య

సూరారం పీఎస్ పరిధిలో ఈ నెల 12న అదృశ్యం...

బాసరగడి వద్ద గోనెసంచిలో బాలిక మృతదేహం లభ్యం

దుండిగల్, అక్టోబర్15: సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 12న అదృశ్యమైన ఓ బాలిక దారుణహత్యకు గురైంది. స్థానికులు, మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఆదిలాబాద్ జిల్లా అంకోలాకు చెందిన దంపతులు ప్రభాకర్, సుమ బతురుదెరువు కోసం ఏడు నెలల కిందట సూరారంకు వచ్చారు. జీవనజ్యోతినగర్‌లో నివాసముంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ నెల 12న ఇంటి ఎదుట ఆడుకుంటున్న పెద్దకూతురు(7) ఒక్కసారిగా కనిపించకుండా పోయింది. ఈ విషయమై పాప తల్లిదండ్రులు సూరారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం ఉదయం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి బాసరగడి గ్రామంలోని నిర్జన ప్రదేశంలో గోనె సంచిలో బాలిక మృతదేహం ఉందంటూ పోలీసులకు సమాచారం అందింది. అక్కడికి చేరుకున్న పోలీసులు సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 12న అదృశ్యమైన బాలికదిగా అనుమానించి ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు ఘటనాస్థలికి చేరుకొని తమ బిడ్డ మృతదేహమేనని నిర్ధారించారు. నిందితుడు తిరుపతి(30)ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాలిక తల్లిపై కన్నేసిన తిరుపతి ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్టు విచారణలో తేలినట్టు పోలీసులు పేర్కొన్నారు. ఇద్దరు కూతుళ్లతో పాటు భర్తను కూడా హతమార్చితే ఆమె తన వద్దకు వస్తుందని తిరుపతి పథకంగా పేర్కొన్నారు. అపహరించిన రోజే బాసరగడికి తీసుకెళ్లి పదునైన కత్తితో గొంతుకోసి,కడుపులో పొడిచి హత్య చేసినట్టు పేర్కొన్నారు.

# గచ్చిబౌలిలో గ్యాంగ్ రేప్?!

▸ మొదటిపేజీ తరువాయి...

రాకపోకలు లేకపోవడం.. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న తన స్నేహితుడితో కలిసి యువతిపై లైంగికదాడి చేశారు. యువతి కేకలు విన్న జొమాటో డెలివరీబాయ్‌తో పాటు మరికొందరు వాహనదారులు ఆటోవద్దకు చేరుకున్నారు. వారిని గమనించిన ఇద్దరూ అక్కడి నుంచి పరారయ్యారు. స్థానికులు వెంటనే 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారమందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు వెంటనే బాధితురాలని గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత భరోసా సిబ్బంది సహకారంతో యువతిని కొండాపూర్‌లోని ప్రభుత్వ జిల్లా దవాఖానకు తీసుకెళ్లారు. బాధితురాలు తల, చేతులకు తీవ్ర గాయాలుండడంతో ఆ తర్వాత గాంధీ దవాఖానకు తరలించారు.

### పోలీసుల అదుపులో నిందితుడు?

ఈ ఘటనలో నిందితుడిని మంగళవారం రాత్రి బోరబండలో అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ఘటనాస్థలంలో లభించిన ఆటో కొత్తది కావడం, నంబర్ ప్లేట్ లేకపోవడంతో నిందితుడి గుర్తింపు ఆలస్యమైనట్టు తెలిసింది. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించినట్టు సమాచారం. కాగా, బాధితురాలు ఆ రాత్రి బీహెచ్‌ఈఎల్ వైపు ఎందుకెళ్లింది. ఆమె ఎక్కడ పనిచేస్తున్నదనే విషయాలపై వివరాలు సేకరించారు. బాధితురాలు నిద్రమత్తులో ఉండడంతో వైద్యానికి సహకరించడంలేదని పోలీసులు తెలిపారు. మాదాపూర్ డీసీపీ వినీత్ మాట్లాడుతూ అఘాయిత్యానికి పాల్పడింది ఆటో డ్రైవర్ ఒక్కడేనని వెల్లడించారు. బాధితురాలు చెబుతున్న విషయాలు కూడా వేర్వేరుగా ఉన్నాయని పూర్తిస్థాయి విచారణ చేస్తున్నట్టు తెలిపారు.

### పోలీస్‌శాఖపై విమర్శలు

గచ్చిబౌలి పరిధిలో నిత్యం వేలాది మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు రాత్రివేళల్లో రాకపోకలు సాగిస్తుంటారు. వీరికి సురక్షిత రవాణా సౌకర్యం పేరిట గతంలో ప్రతి ఆటో వివరాలను పోలీస్ రికార్డుల్లో నమోదు చేసుకొని 'మై ఆటో ఈజ్ సేఫ్' అనే స్టిక్కర్లను పోలీసులు అంటించారు. ఈ ఆటోలపై పోలీసుల నిఘా గతంలో కొనసాగుతూ వచ్చింది. ప్రస్తుతం ఆ నిఘా లోపం వల్లే ఈ ఘటన జరిగిందని విమర్శలు వినిపిస్తున్నాయి.

## హై సెక్యూరిటీ ప్రాంతంలోనే లైంగిక దాడా?

- 'గచ్చిబౌలి' ఘటనపై ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలి
- శాంతిభద్రతలపై సీఎం ఒక్కరోజూ సమీక్షించలేదు
- మాజీ మంత్రి టీ హరీశ్ రావు



హైదరాబాద్, అక్టోబరు 15 (నమస్తే తెలంగాణ): హై సెక్యూరిటీ ప్రాంతంగా భావించే గచ్చిబౌలిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై లైంగిక దాడి ఘటనతో ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమైందని మాజీ మంత్రి టీ హరీశ్‌రావు మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. కాంగ్రెస్ పాలనలో అత్యాచారాలు, హత్యలు నిత్యకృత్యం అయ్యాయని, నేరాల రేటు గణనీయంగా పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు రోజురోజుకూ క్షీణిస్తున్నా ప్రభుత్వానికి కనీస పట్టింపు లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. హోంమంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రి ఒక్కనాడు శాంతిభద్రతలపై సమీక్షించలేదని విమర్శించారు. మహిళా భద్రతకు చిరునామాగా ఉన్న తెలంగాణలో ఇలాంటి ఘటనలు వరుసగా జరగటం ఆందోళనకరమని విచారం వ్యక్తం చేశారు. బాధితురాలికి భరోసా కల్పించాలని, నిందితులను గుర్తించి కఠిన శిక్ష పడేలా చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. దీనిపై సీఎంవోకు, తెలంగాణ డీజీపీకి ట్యాగ్ చేశారు.